క్లుప్తంగా

శివాలయంలో ఎంపీ మోపిదేవి పూజలు



తాడేపల్లిరూరల్: రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ కార్తిక సోమవారం పురస్కరించుకుని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలో వేంచేసి యున్న గంగా బాల త్రిపురసుందరి రాజరాజేశ్వరి దేవి తాండవేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యసభ్యులు మోపిదేవి వెంకటరమణ రాకను పురస్కరించుకుని పూజారి భానుమూర్తి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పసల్ బీమా యోజన రైతులకు వరం



ఫిరంగిపురం: పసల్‌బీమా యోజన రైతులకు వరం వంటిదని అగ్రికల్చరల్ డీడీ రామాంజనేయులు అన్నారు. మండలంలోని మేరికపూడి గ్రామంలో సోమవారం వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటపొలాలకు ప్రధానమంత్రి పసల్‌బీమా యోజనద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అనంతరం పలు పథకాలు పొందిన లబ్ధిదారులు తమకు అందిన పథకాల గురించి వివరించారు. సర్పంచ్ కె.పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు హనుమాయమ్మ, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా తడిసి, రంగు మారిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో పంట పొలాలను సోమవారం రైతు, కౌలు రైతు నాయకులతో కలసి పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం వ్యవసాయ అధికారి కె.వెంకటేశ్వరరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతాంగం, కౌలు రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కౌలు రైతులు డి.భాగ్యారావు, కోటేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగరంలోని నవులూరు, బాపూజీ నగర్, నీరుకొండ శిబిరం ప్రాంతాలలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లు మార్పు నిమిత్తం విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మద్యం సీసాలు ధ్వంసం



తాడికొండ: తాడికొండ ఠాణా పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాడికొండ ఠాణా పరిధిలో పట్టుబడిన 24 సీసాల మద్యంను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణా, ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి అమ్మడం నేరమని అలా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ మద్యం అమ్మకాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్‌ఐ నాగార్జున పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

చేబ్రోలు: స్థానిక నాగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేశ్వరస్వామి ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో పెద్దసంఖ్యలో భక్తులు కార్తిక దీపాల్ని వెలగించారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో చివరి కార్తిక సోమవారం సందర్భంగా విశేష పూజల్ని నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సమన్యాయం జగనన్నతోనే సాధ్యం

మోతడకలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

మోతడక(తాడికొండ): అన్నివర్గాలకు సమన్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మండల జేసీఎస్ కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం తాడికొండ మండలం మోతడక గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంక్షేమ పథకాల పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తరువాతే ఎన్నికలకు వెళ్లి ఓటు అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న ఒక్కరే అని, ఆయన ప్రవేశ పెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజాదరణ లేని పార్టీలన్నీ బాబును అధికారంలోకి తెచ్చేందుకు పడుతున్న ఆరాటం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రసాద్, మాజీ అధ్యక్షుడు వెంకటయ్య మాస్టారు, వైఎస్సార్ సీపీ నాయకులు వాడకొప్పుల రాజు, సంసోన్, మాధవ, పొన్నెకల్లు సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు, పలువురు గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోతడకలో సంక్షేమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కేఎల్‌యూలో 'సైంధవ్' టీం సందడి

తాడేపల్లిరూరల్: విద్యార్థి దశ నుంచి జీవితంలో సర్దుకుపోవడం నేర్చుకోవాలని హీరో వెంకటేష్ అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సోమవారం సైంధవ్ చిత్రంలోని సరదా సరదాగా అనే పాటను విద్యార్థుల కేరింతల నడుమ విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ సైంధవ్ చిత్రం తనకు 75వ చిత్రం అని, యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల మన్ననలు అందుకుంటుందని ఆశిస్తున్నానన్నారు. విద్యార్థి దశ నుంచి జీవితంలో సర్దుకుపోవడం నేర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిని గౌరవించడం తెలుసుకున్నప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని విద్యార్థులకు సూచించారు. చిత్ర దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ హీరో వెంకటేష్ నటించిన చిత్రం సైంధవ్ సంక్రాంతి కానుకగా జనవరి 13న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్నదని అన్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నట్లు తెలిపారు. చిత్ర నిర్మాత వెంకట్ బోయినపల్లి, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి డ్యాన్స్ చేస్తున్న హీరో వెంకటేష్

మహిళల ఆర్థికాభివృద్ధే దేశాభివృద్ధి

తాడేపల్లిరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని చాలిస్ డైరెక్టర్ సిస్టర్ లత అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ ఆధ్వర్యంలో స్వయం కృషి పరస్పర సహాయక సహకార పొదుపు మరియు పరపతి సంఘం లిమిటెడ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిస్టర్ లత మాట్లాడుతూ తాడేపల్లి, మంగళగిరి మండలాల నుంచి సుమారు 220 మంది మహిళలు ఈ సమావేశంలో పాల్గొన్నారని, స్వయం కృషి కో–ఆపరేటివ్ ద్వారా ఆర్థిక సహాయం పొందిన వారు, ఎటువంటి కుటీర వ్యాపారాలు చేస్తున్నారో, వారు ఎలా లాభాలను ఆర్జిస్తున్నారో గ్రూప్ లీడర్స్ వివరించడం జరిగిందని అన్నారు. అనంతరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ రంగరాజు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ఇలాంటి స్వయం ఉపాధి మహిళలకు ఉన్న అవకాశాల గురించి వివరించి మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు. గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ ఉదయ మాట్లాడుతూ మహిళ సాధికారత సాధించుటకు ఇది ఒక అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ రంగరాజు

తాడేపల్లి చేరిన 'వన్స్‌మోర్ జగనన్న' పాదయాత్ర



తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ రావి కవతం మండలం జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన గాలి గణేష్ విశాఖ నుంచి తిరుపతి వరకు చేపట్టిన పాదయాత్ర సోమవారం తాడేపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ అమరజ్యోతి పాదయాత్ర పేరుతో ఈ యాత్ర నిర్వహిస్తున్నానని, గతంలో 5 సార్లు విశాఖ నుంచి ఇడుపుల పాయకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతికి పాదయాత్ర చేయడం జరిగిందని తెలిపారు. మహానేత ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా లబ్ధిపొందిన తాను ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నాని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి జరగాలన్నా జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



మల్కాపురం(తాడికొండ): తుళ్ళూరు మండలం మల్కాపురం, మందడం, వెలగపూడి గ్రామాల్లో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక విజయవాడ, గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం మరియు త్రైత సిద్ధాంత సారాంశ అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. సేవా సమితి, జ్ఞాన సమితి అధ్యక్షులు జగీరపు సురేష్, రౌతు శ్రీనివాస్ సభ్యులు కృష్ణారావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఆలయాన్ని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సూచించారు. కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని పెదకాకాని శివాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్తిక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి భక్తులు దీపాలు వెలిగించుకుంటున్న ప్రాకార మండపం, కల్యాణ కట్ట, పొంగలి షెడ్డు, గాలి గోపురం ప్రాంతాల్ని పరిశీలించారు. ఆలయ సిబ్బంది, బందోబస్తుకు వచ్చిన వారి వాహనాలు సైతం ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసి అందులో పెట్టుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో వాహనం కనిపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆలయానికి వస్తున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, పారిశుద్ధ్య విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావుకు సూచించారు.



ఈఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ శివశంకరరావుకు సూచనలిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

విద్యార్థి దశలో బాధ్యతాయుత ప్రవర్తనతో మెలగాలి

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: కళాశాల విద్యార్థి దశలోకి అడుగుపెట్టిన విద్యార్థులు క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుత ప్రవర్తనతో మెలగాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మాడీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు తరగతుల ప్రారంభం సందర్భంగా "దీక్షారంభ్" పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో గుంటూరు వైద్య కళాశాలలో గడిపిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ, అక్కడ చదవడం విద్యార్థులందరికీ మధుర జ్ఞాపకంగా ఉంటుందని తెలిపారు. వైద్య వృత్తికి ఫార్మసీ విద్య అనుసంధానంగా ఉంటుందని, విద్యార్థులు ప్రమాదకర జబ్బులకు ఔషధాలు కనిపెట్టేందుకు పరిశోధనలు చేయాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని, భావి జీవితానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన హిందూ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాలను లాభాపేక్షకు తావులేని రీతిలో విద్యార్థులకు ఉజ్వల భవిత అందించడమే ధ్యేయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, దీక్షారంభ్ సమన్వయకర్త డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు

రేపు పెదపాలెంలో బజరంగ్ నేత్రజ్యోతి

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



కొరిటిపాడు(గుంటూరు): బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపర కొనసాగిస్తూ నేత్రజ్యోతి పేరుతో అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పొన్నూరు మండలంలోని పెదపాలెంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలు ఎక్కువగా ఉన్న గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరాల్లో కంటి సమస్య ఉందని గుర్తించిన వారికి ఏడు రోజుల్లోగా కళ్లజోళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో అనేక గ్రామాల్లో నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరాలకు అనూహ్య రీతిలో స్పందన లభించిందని చెప్పారు. ఇప్పటి వరకు 14,024 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 12,005 మందికి కళ్లజోళ్లు అందించినట్లు అంబటి మురళీకృష్ణ వివరించారు.

రాష్ట్రస్థాయి లలిత కళా ఉత్సవంలో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి లలిత కళా ఉత్సవంలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ కీబోర్డు పోటీలో 9వ తరగతి విద్యార్థి పి. నందకిషోర్, తాళ వాయిద్య పోటీలో 8వ తరగతి విద్యార్థి టి. బోస్ అనుదీప్ ద్వితీయ బహుమతులు గెలుపొందినట్లు వివరించారు. విద్యతో పాటు సంగీత, సాహిత్య కళల్లో మేటిగా అన్ని రంగాల్లో రాణించే విధంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తీర్చిదిద్దిన సంగీత విద్వాంసుడు నెమలి రాంబాబును ప్రశంసించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ పాలేటి తేజస్వి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు

సేవాభావం పెంపొందించుకోవాలి



తాడికొండ: ప్రతి ఒక్కరూ సేవాభావం పెంపొందించుకొని ప్రతిభ కలిగిన విద్యార్థులకు తమవంతు సహకారం అందించాలని తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల పాలకవర్గ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఎన్ఆర్ఐ చెరుకూరి శ్రీధర్ పుట్టిన రోజు పురస్కరించుకొని ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు రూ.20 వేలు విలువ చేసే 4 సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పెరికల దేవరాజు, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్‌వీ రమణయ్య, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చానల్‌లో దూకి వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ మనస్తాపానికి గురైన వృద్ధురాలు సోమవారం చేబ్రోలులోని కొమ్మమూరు చానల్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆమెను స్థానికులు, 108 సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. చుండూరు మండలం మున్నంగివారి పాలెం గ్రామానికి చెందిన గుత్తా జయలక్ష్మి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం చుండూరు నుంచి వచ్చిన ఆమె కొమ్మమూరు చానల్ బ్రిడ్జి నుంచి కొంత దూరం వెళ్లి అక్కడ నీటిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రవాహానికి కొట్టుకుపోతున్న ఆమెను బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న బిహార్‌కు చెందిన కూలీలు గమనించి, చానల్‌లో వినాయక విగ్రహ నిమజ్జనాలు చేసే మట్టి దిబ్బ వద్దకు చేర్చారు. హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకున్న 108 సిబ్బంది చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. చానల్‌లో దూకడంతో జయలక్ష్మి కాలు విరిగిపోయింది. సుమారు పది అడుగుల ఎత్తులో ఉన్న కట్టమీదకు చేర్చటానికి సమస్యగా మారింది. పెద్ద సంచిలో వృద్ధురాలిని కూర్చోబెట్టి ఇనుప నిచ్చెన ద్వారా స్థానికుల సహాయంతో 108 సిబ్బంది పైకి తీసుకువచ్చారు.



నిచ్చెన సాయంతో వృద్ధురాలిని పైకి తీసుకొస్తున్న 108 సిబ్బంది, స్థానికులు

రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



కాకుమాను: మండలంలో రౌడీషీటర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, భవిష్యత్‌లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో రాత్రి సమయాల్లో ప్రతి రోజూ గస్తీ నిర్వహించి, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పెడింగ్ కేసుల వివరాలను పరిశీలించి, ఎస్‌ఐ రవీంద్రను అభినందించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే సీనియర్ డీఈఈ దినేష్‌రెడ్డికి అవార్డు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్‌లో సీనియర్ డీఈఈగా పని చేస్తున్న సీహెచ్. దినేష్‌రెడ్డికి అతి విశిష్ట రైలు సేవా పురస్కార్ అవార్డు లభించింది. ఆయన విజయవాడ డివిజన్‌లో చేసిన సేవలు, ప్రతిభను గుర్తించి రైల్వే మంత్రిత్వ శాఖ ఈనెల 15న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేసింది. దినేష్‌రెడ్డి 2016లో జీఎం అవార్డు, 2013లో పీసీఈఈ అవార్డు కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్ఎం రామకృష్ణ, సిబ్బంది అభినందించారు.

అసమానతలు లేని ఆర్థిక వ్యవస్థతోనే పేదరిక నిర్మూలన



లక్ష్మీపురం: అసమానతలు లేని ఆర్థిక వ్యవస్థతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని న్యాయవాది, విశ్లేషకుడు ముప్పాళ్ల ప్రసాదరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న పారిస్‌లో సమావేశమైన ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సభ ప్రపంచవ్యాప్తంగా పౌర హక్కుల పరిరక్షణకు ప్రతిజ్ఞ చేసిందని, అదే సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనగా ప్రసిద్ధి పొందిందని తెలిపారు. మానవ హక్కులతో కూడిన ఆర్థిక వ్యవస్థలోనే పేదరిక నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతోనే మానవ హక్కులు నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు కూడా మానవ హక్కుల్ని గౌరవించాలని కోరారు. సమావేశంలో అవగాహన సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంట మంత్రివారి వీధిలోని అయ్యప్ప రెసిడెన్సీ నిర్వాసితుల ఆధ్వర్యంలో సోమవారం కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితులు శ్రీమాన్ తాతాచార్యులు కార్తిక మాస విశిష్టతను తెలియజేసి, పూజల్ని నిర్వహించారు. భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో మద్ది రవికుమార్, మహంకాళి శ్రీనివాసరావు, కిశోర్, అనిల్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

చదువే ధైర్యం.. గమ్యం

గుంటూరు రూరల్: విద్యార్థులకు చదువే ధైర్యం .. గమ్యమని పాశం సొసైటీ అధ్యక్షుడు పాశం సర్దార్ అభినంద్ యాదవ్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం పాశం రూరల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ ప్రసంగం (మోటివేషనల్ స్పీచ్) నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అభినంద్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే నాటి నుంచే భవిష్యత్తుకు మార్గం వేసుకునే దిశగా కృషిచేయాలని సూచించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు అందించడమే తమ సొసైటీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. టైం మేనేజ్‌మెంటు, గోల్ సెట్టింగ్ వంటి పలు విషయాలపై విద్యార్థులకు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ యద్దనపూడి ఆరుద్ర అవగాహన కల్పించారు. నేటి యువత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాన్ని సాధించే విధంగా తగిన ప్రణాళికలతో సాగాలని సూచించారు. సమయ స్ఫూర్తితో విద్యలో రాణించాలని తెలిపారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే దానికి తొలిమెట్టు చదివేనని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ అతిథుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీ బాలాజీ, సొసైటీ కార్యదర్శి పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్, సొసైటీ సభ్యులు ఉమేష్ చంద్ర, నిహాంత్, కిశోర్ పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

కార్తికమాసం చివరి సోమవారం కిటకిటలాడిన శైవలయాలు

ఫిరంగిపురం: మండలంలోని గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పలు ఆలయాలవద్ద భక్తులు ఒత్తులు వెలిగించి పూజలు చేశారు. ఫిరంగిపురంలోని నగరేశ్వరస్వామి ఆలయం, కాళహస్తీస్వరస్వామి ఆలయంలో అర్చకులు ఆంజనేయశర్మ, రాజేంద్రశర్మలు విశేష పూజలు చేశారు. వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామికి నమకచమకాలతో అర్చకులు ఉమాపతిశాస్త్రి అభిషేకాలు నిర్వహించారు. గరుడాచలపాలెంలోని ఉమామహేశ్వర ఆలయంలో అర్చకులు లక్ష్మీనారాయణశాస్త్రి విశేషపూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకొని దీపాలు వెలిగించారు.

